కథ

మధ్యగదిలో పన్నెండేళ్ల అరుణ ఎనిమిదేళ్ల చెల్లెలుకి 'నీతిసూత్రాలు' పాఠం బోధిస్తోంది-పెద్దలను పూజింపుము, అబద్ధమాడరాదు,దొంగతనము చేయరాదు అంటూ-

శిరసువంచిన ఆకాశం



భమిడి వెంకటేశ్వర్లు

హాల్లో పదహారేళ్ల శ్రీనివాస్ రెండు రోజుల క్రితం పోయిన పెన్ను వెతుక్కున్నాడు. ఆ పెన్ను అమెరికా తయారీ, దానిని మేనమామ మూడేళ్ల క్రితం బహూకరించాడు. టెన్త్‌క్లాస్ చదువుతున్న శ్రీనివాస్ అంటే ఆ మేనమామ కెంతో ఇష్టం. తను బుద్ధిమంతుడు, తెలివైన వాడు, బాగా చదువుతాడు అని. ఈ పెన్ను వచ్చాక శ్రీనివాస్‌కి చదువులో శ్రద్ధ పెరగడమే కాదు మంచి మార్కులు కూడా రాసాగాయి. అటువంటి పెన్ను ఇప్పుడు పోయింది. అదొక సెంటిమెంటుగా బాధిస్తోంది. పెన్ను ఎలాపోయిందో అర్థం కావడంలేదు. ఇంతవరకూ ఆ పెన్నుని ఎవరికీ ఇచ్చింది లేదు. కనీసం అరుణకు కూడా. తనకు మంచిమార్కులొస్తున్నాయని ఎవరికైనా కన్నుకుట్టిందేమోననిపించింది. పెన్ను దొంగిలిస్తే మార్కులు తగ్గి పోతాయేమోనని పించగానే ఏదో కంగారు, భయం, కలగ సాగింది. శ్రీనివాస్‌లో ఆలోచనలు కంది రీగల్లా రొద పెట్టసాగాయి.

పబ్లిక్ పరీక్షలు ఇంకా ఇరవై రోజులున్నాయి. సరిగ్గా ఈ సమయంలో పెన్ను పోవడం బాధగానూ, విచారంగానూ వుంది. మరో పెన్నుతో పరీక్షలు రాస్తే మంచి మార్కులు మాట దేవుడెరుగు కనీసం పాస వలేనేమోనన్న బెంగ పట్టు కుంది. మరో వైపు తండ్రి దెబ్బలు, చివాట్లు. ఇప్పుడు రెండు రోజుల్నుంచీ వెతుకు తున్నా పెన్ను కనిపించడం లేదు. ఏమయిపోతుందో, ఎలా పోయిందో అర్థం కావడం లేదు శ్రీనివాస్‌కి.

విసుగు చెందిన విక్రమార్కుడిలా అన్ని గదుల్లోనూ పెన్ను వెతుకుతూనే వున్నాడు శ్రీనివాస్‌కి. అరుణ పాఠం బోధిస్తునేవుంది.

"ఆ పాఠం నీకా దానికా... నీ గొంతే కాని దాని కొంతు వినపడడమే లేదు. ఆక ఆ పుస్తకం అవతల పారేసి నీ చదువు సంగతి ఏడు. ఇందాకట్నుంచి ఒకటే గోల. నస.. ఆ పాఠం తప్పిస్తే ఇక పాఠాలేలేవా ఆ పుస్తకంలో..." అంటు అరుణ మీద విరుచుకు పడ్డాడు శ్రీనివాస్.

"మధ్యలో నీ గొడవేంది... నా ఇష్టం... నీ కెందుకు... నేనేమైనా నీకు అడ్డా.." అరుణ అదే స్థాయిలో బదులిచ్చింది.

"చిన్నా పెద్ద లేకుండా ఏమిటా తల పొగరు. నీకూ పరీక్షలు వస్తున్నాయిగా, చదువు కోవచ్చుగా.. దానిచద్దువేదో అదేడుస్తుందిలే.. వెళ్లు" అంటూ పెద్దరికాన్ని ప్రదర్శించాడు శ్రీనివాస్ మరింత చిరాగ్గా.

అరుణ వినిపించుకోకుండా పాఠం బోధిస్తూనే వుంది, పెద్దలను పూజింపుము, అబద్ధమాడరాదు, దొంగతనము చేయరాదు... ....

"వెధవ పెన్ను పోతే పోయిందిలే కాని మరొకటి కొనుక్కోవచ్చు. మామయ్యకు రాస్తే మరొకటి పంపిస్తాడు పోనీ... దొరకని పెన్ను కోసం ఎందుకా వృథా ప్రయాస..." కొంచెం సేపయ్యాక అంది అరుణ.

"నీ ఉచిత సలహాలు నాకవసరం లేదు గానీ నోరుమూసుకుని ఏడు" అని అరుణ చెంపమీద కొట్టాడు శ్రీనివాస్.

అరుణ ఏడవ సాగింది.

"ఇంతకీ ఆ కుక్కపిల్లకి నీళ్లు పోసావా... బిస్కెట్లు తినిపించావా..." కోపం గానే అడిగాడు.

"అది నాకు లొంగడం లేదు. నన్నేడిపించేస్తోంది. దాని సంగతి నువ్వే చూసుకో..." ఏడుస్తూనే చెప్పింది తను.

శ్రీనివాస్ ఆ కుక్కపిల్లని నాలుగు రోజుల క్రితం తీసుకువచ్చాడు. అప్పటి నుంచి దాని డ్యూటీ అరుణకు అప్ప గించేశాడు. తండ్రి అడిగితే ఎవరో ఇచ్చారని చెప్పారు. అరుణ కుక్కపిల్లకు రెండు రోజులు నీళ్లు పోసి, బిస్కెట్లు తినిపించింది. షికారుకు తిప్పింది. కేవలం సరదా కోసం... కాని దాని సంరక్షణా భారం అరుణకే అప్పగించబడగానే చికాకు కలిగింది. ఫలితంగా శ్రీనివాస్‌కి కోపం.. దానికి తోడు కుక్కపిల్ల ఏడిపిస్తూవిసిగించడం...

"అన్నయ్యా... ప్రభాకరంగారు వాళ్ల బ్బాయిని కుక్క పిల్ల పోయినందుకు ఎలా కొట్టేరో తెలుసా.." అంది అరుణ పుస్తకాలు సర్దుతూ.

శ్రీనివాస్ వినిపించు కోలేదు.

తను ఆ కుక్క పిల్లని కావాలని దొంగిలించాడా! 'స్మిత' అందంగా వుంది. ముద్దుగా వుంది. అడిగితే ఎవరిస్తారు! అందులో ప్రభాకరం గారా.. అపుడు శ్రీనివాస్‌కి 'బెగ్, బారో, స్టీల్'' మాటలో చివరి మాట గుర్తు కొచ్చింది. అంతే, వెంటనే 'స్మిత'ను దొంగి లించాడు.

స్మిత రావడం, పెన్ను పోవడం రెండు రోజుల వ్యవధిలో జరిగి పోయింది. తన పెన్ను పోవడం వల్ల తనెంత బాధ పడుతున్నాడో, ప్రభాకరం గారు-వారి కొడుకు,స్మిత పోయి నందుకు అంతే బాధ పడుతూ వుండ వచ్చునని పించింది శ్రీనివాస్‌కి.

"నేను ట్యూషను కెడుతున్నాను. వచ్చే సరికి స్మితకు స్నానం చేయించి బిస్కెట్ తినిపించాలి. లేక పోతే వీపు వీరేస్తాను ముందు, ఆ పుస్తకం అవతల పారేయి... అర్థమయిందా..." అంటూ కళ్ళెర్ర జేశాడు శ్రీనివాస్.

కొంచెం సేపయ్యాక వెళ్లి పోయాడు తను.

అరుణ అయిష్టంగానే తలూపింది.

ప్రభాకరంగారింట్లో శ్రీనివాస్ లెక్కలు చేస్తున్నాడు. తన మనసేమీ కుదురుగా లేదు. లెక్కలు తప్పుతున్నాయి. ప్రభాకరం ఆఫీసు నుంచి రాక పోవడంతో, ఆయన భార్య సలహా ప్రకారం లెక్కలు చేస్తున్నాడు... ఒక వైపు పెన్ను పోయినందుకు, మరో వైపు లెక్కలు తప్పుతున్నందుకు శ్రీనివాస్‌లో ఆందోళనకు కారణ మవుతుంది.

ప్రభాకరం ఎప్పటికీ రాక పోయే సరికి, శ్రీనివాస్ ఇంటికి బయలు దేరాడు. గంట తరువాత.

ఇంటికి రాగానే పిడుగు లాంటి వార్త చెప్పింది అరుణ "అన్నయ్యా.. స్మిత కనిపించడం లేదు'' అని

"కనిపించడం లేదా... ఏమయింది... ఎక్కడికి పోతుంది... గొలుసుతో కట్ట లేదా... గేటువేయలేదా... ఎవరైనా ఇంటి కొచ్చారా... నువ్వు కొంప లోనే వున్నావా'' అంటు ప్రశ్నల వర్షం కురిపించాడు శ్రీనివాస్.

"ఏమో తెలీదు. అమ్మ బజారు కెళ్లింది నేను, చెల్లాయి ఎదురింట్లో కారమ్స్ ఆడేందుకు వెళ్ళాం. వచ్చే సరికి స్మిత లేదు'' అంది అరుణ.

మరోసారి చెంప మీద కొట్టాడు తను.

ప్రభాకరం గారి కొడుకు తనలాగే వచ్చి స్మితను తీసుకు పోయి వుంటాడనిపించింది. పెన్ను పోయింది. స్మిత పోయింది. తనె కేమీ అర్థం కావడం లేదు. స్మిత ప్రభాకరం గారింటే చేరితే ఫర్వా లేదు.. అలా కాక, వేరెవరైయనా ఎత్తు కెళ్లి వుంటే.. ఆలోచించ లేక పోతున్నాడు తను. అందుకే ప్రభాకరం గారింటికి బయలు దేరాడు శ్రీనివాస్.

గుమ్మంలోనే ఎదురైనాడు ప్రభాకరం.

శ్రీనివాస్‌కి పోర్టికోలో స్మిత కనబడ లేదు.

"ఇప్పుడు ట్యూషను చెప్పే ఓపిక లేదు-నాకు... రేపు రా'' అన్నాడు ప్రభాకరం నిశ్చయంగా.

"నేనందుకు రాలేదు... స్మిత మీ ఇంటికి వచ్చేసిందే మోనని...'' అనాలను కున్నాడు కానీ పెదవులు కదల్లేదు.

శ్రీనివాస్ కదల్లేదు.

"నేనిప్పుడు కుక్కపిల్లను కొనేందుకు వెళుతున్నాను. అదిలేక పోతే మా వాడు అన్నం తినడం లేదు. మా కేమీ తోచడం లేదు. మా స్మితను ఎవరు ఎత్తుకు పోయారో ఏమిటో... అన్నట్టు, ఆ మధ్య నువ్వు కుక్కపిల్లను అడిగేవు కదూ... కావాలంటే నా తోరా, నువ్వు కూడా తెచ్చు కుందువు గాని.... మీ ఫాదర్‌ని అడిగి రెండొందలు తీసుకురా.'' అన్నాడు ప్రభాకరం.

"రెండొందలా... కుక్క పిల్ల ఖరీదు రెండువందలా'' అని ఆశ్చర్య పోయాడు శ్రీనివాస్.

"అవును... రెండు రూపాయల కొస్తుం దనుకున్నావా నాయినా'' ప్రభాకరం వెటకారంగా అన్నాడు.

శ్రీనివాస్ ఆలోచిస్తున్నాడు. మరో మాట చెప్ప కుండా ఇంటివైపు నడిచాడు తను. స్మిత పోయిందని తండ్రికి చెప్తే సంతోషిస్తాడు. కొత్త కుక్కపిల్ల కొనుక్కుంటానని డబ్బు అడిగితే వీపు చిట్ల కొడతాడు. పెన్ను పోయిందన్న విషయం కూడా తండ్రికి తెలియదు. చెప్పే ధైర్యం కూడా తనకు లేదు. అరుణ అసలే చెప్పదు.అందుకే తను ధైర్యంగా వున్నాడు.

నిజానికి స్మిత కనిపించడం లేదన్న వార్త ప్రభాకరంతో- అతని భార్య ఫోనులోచెప్పినపుడు ఉగ్రుడై పోయాడు తను. ఏడుకిలో మీటర్ల దూరంలో వున్న ఆఫీసు నుంచి ఇంటికి కేవలం ఎనిమిది నిముషాల్లో వాలి పోయాడు. స్మిత అతని ప్రాణం. ఇంట్లో వున్న పుడు దాని బాధ్యత అతనిదే.

అపుడపుడు భార్యది, కొడుకుది, రాష్ట్రాలకు మంత్రులు, ముఖ్య మంత్రులు లేక పోయినా ప్రజా జీవితం స్తంభించి పోదు. పదవుల కోసం నాయకులు పోటీ పడినా, లేక పోయినా ఫరవా లేదు. కాని స్మిత కనిపించక పోయినా, దానికి సంరక్షణ చేయక పోయినా, దానితో కబుర్లాడక పోయినా ప్రభాకరంకు ఎట్లాగో వుంటుంది.

అంత హఠాత్తుగా ఇంటి కొచ్చేసిన భర్తని చూసి కంగారు పడి పోయింది ఆ భార్యామణి.

"ఎలా పోయింది.. నువ్వు కొంపలో లేవా..'' అని విరుచుకు పడి పోయాడు ప్రభాకరం.

జవాబు లేదు. చుట్టు పక్కల కెళ్లి చూసొచ్చాడు. అరపెట్టె సిగరెట్టు వూదేశాడు. కోపం, పతాక స్థాయికి చేరుకుంది. పోర్టికో వైపే, స్మిత కూర్చునే చోటే, అదిపాలు తాగే గిన్నెవైపే, చూస్తుండి పోయాడు ప్రభాకరం. సాయంత్రం వాడు రాగానే 'ఏం చెప్తావ్'' అంటూ భార్యని ప్రశ్నించాడు ప్రభాకరం.

సదరు 'వాడు' వారి కొడుకు గేటు చప్పుడు విన బడగానే స్మిత తోకాడిస్తూ పరుగెడుతుంది. స్కూలు బ్యాగుని నోటితో కరిచి పట్టుకుని ఇంట్లోకి తీసుకు వస్తుంది. వళ్లో కూర్చుంటుంది. ఏమిటేమిటో చేస్తుంది... అంత అలవాటు వారికి.

ప్రభాకరం పోలీసు రిపోర్టు ఇద్దామను కున్నాడు. కాని దేశంలో హోల్‌సేల్‌గా మర్డర్లు జరుగుతున్నా హంతకులు దొరకని రోజులు. పబ్లిగ్గా, రన్నింగ్ ట్రెయిన్‌లో రేప్‌లు జరుగు తున్నా గూండాలను పట్టుకోలేని కాలం.. ఎన్నికలపుడు పోలింగ్ బూతుల నుంచి బాలెట్ పెట్టెలను ఎత్తుకు పోతుంటే నిస్సహాయు లుగా నిలబడ్డ పరిస్థితులు. అటు వంటిది ఓ కుక్క పిల్లని తెచ్చివ్వగలరా పోలీసులు! అందుకే సదరు ఆలోచనకు తిలోదకాలు ఇచ్చాడు.

స్మిత సిల్కు సిడ్నీ రకానికి చెందినది.

ప్రభాకరంకు దారిలో ఎవరో చెప్పారు. కొండ గుట్టదగ్గర ఓ కుక్కల వ్యాపారి వున్నాడు. వాడిదగ్గర ఎన్నో రకాల కుక్కలున్నాయి. నిరుద్యోగ యువకులు ఇళ్ళల్లో నుంచి కుక్కల్ని దొంగిలించి అక్కడకు చేరవేస్తుంటారు. ఆ వ్యాపారి వాటిని పెట్రోలు దేశాలకు ఎగుమతి చేస్తుంటాడు అని. కాని ప్రభాకరంకు ఆ ప్రాంతానికి వెళ్ళేందుకు భయం.

మర్నాడు-శ్రీనివాస్ ప్రభాకరం ఇంటికి ట్యూషనుకు వెళ్లాడు యథా ప్రకారంగానే.

ఆశ్చర్యం.. అతనికి పోర్టికోలో స్మిత కనిపించింది. అదివారిదే... తాను దొంగిలించి నదే... ఇక్కడికెలా వచ్చింది.. ఆలోచిస్తున్నాడు శ్రీనివాస్.

"ఏమిటలా చూస్తున్నావ్... మా స్మితే..'' అన్నాడు ప్రభాకరం స్మితను ముద్దాడుతూ.

"ఎంతకు కొన్నారు'' కావాలనే అడిగాడు శ్రీనివాస్.

"కొనడం ఏమిటి... ఇది వరకటిదే.. నా స్మిత నన్ను వెతు క్కుంటూ వచ్చింది...''. గర్వంగా చెప్పాడు అతను.

శ్రీనివాస్ ఖంగు తిన్నాడు.

"మీ స్మితను నేనే దొంగి లించాను'' అని చెప్పే సాడు శ్రీనివాస్ ఇక లాభం లేదనుకుని.

"ఎందుకు దొంగిలించావు'' అడిగాడు ప్రభాకరం.

జవాబు లేదు.

"ఎన్నో విషయం అడుగుతాను, జవాబు చెప్పాలి''

"ఏమిటీ'' అడిగాడు శ్రీనివాస్.

నీకు మంచి కుక్కపిల్ల-ఇటు వంటిదే ఇస్తాను జాగ్రత్తగా పెంచు తావా''

శ్రీనివాస్‌ముఖం మతాబాలా వెలిగింది.

"పెన్నులాగే పోగొడతావా'' అన్నాడు ప్రభాకరం.

శ్రీనివాస్‌కి, పెన్నువిషయం గుర్తుకు రాగానే ఏడుపు వచ్చింది. ఈవిషయం ఈయనకు ఎలా తెలుసాని.

ప్రభాకరం డ్రాయర్లోనుంచి పెన్ను తీసి శ్రీనివాస్‌కిస్తూ చెప్పాడు'' ఇదిగో నీ అమెరికా పెన్ను''

మరోసారి ఆశ్చర్యం కలిగింది తనకి. ఏమీ అర్థం కావడం లేదు. అంతా వింతగా వుంది.

"నువ్వు స్మితను దొంగిలించావు. అరుణకు దాని బాధ్యత అప్పగించి, బాధించ సాగారు. తను నీకు భయపడి చేసింది తప్ప మరో ఆలోచనతో కాదు. అందుకే తను నీ పెన్ను తీసి నాదగ్గర దాచింది-జరిగిన విషయం చెప్తూ. నువ్వు చేసిన తప్పు పనిని నీకు తెలియ జేయాలని, నీతి సూత్రాలు పాఠం ద్వారా ప్రయత్నించింది. కాని, నువ్వు తనని దెబ్బలతో సత్కరించావు. చివరికి స్మితను కూడా తనే మాకు అందజేసింది'' ప్రభాకరం చెబుతున్నాడు.

శ్రీనివాస్ సిగ్గుతో తల వంచుకున్నాడు.

"నీకు వచ్చే ఆదివారం.. ఇటు వంటి కుక్క పిల్లనే బహూకరిస్తాను'' అన్నాడు ప్రభాకరం.

ఇంటికెళ్లిన శ్రీనివాస్‌కి అరుణ కనిపించింది. చెల్లెలుకు పాఠం చెప్తూ-పెద్దలను పూజింపుము, అబద్ధ మాడరాదు, దొంగ తనము చేయరాదు...

ఈసారి తనకు కోపం రాలేదు.... ప్రేమ కలిగింది.

201